నేటి మ్యాచ్
ఆస్ట్రేలియా X శ్రీలంక
మ. 2.00 నుంచి
వేదిక: లక్నో

జగజ్జేతకు ఝలక్

అఫ్గానిస్థాన్ సంచలన విజయం..

ఇంగ్లండ్‌కు భారీ షాక్

ముజీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

మెరిసిన రహ్మానుల్లా, రషీద్‌ఖాన్

వన్డే ప్రపంచకప్‌లో అతిపెద్ద సంచలనం నమోదైంది. ఏకపక్షంగా సాగుతుందని భావించిన పోరులో.. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను అఫ్గానిస్థాన్ ఊహించని దెబ్బకొట్టింది!

మొదట బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడి మంచి స్కోరు సాధించగా.. ఆనక అఫ్గాన్ బౌలర్లు ఇంగ్లిష్ ప్లేయర్లను చెడుగుడు ఆడుకున్నారు. ముజీబ్, రషీద్, నబితో కూడిన స్పిన్ త్రయం విజృంభణతో ఇంగ్లండ్ విలవిలలాడింది!!

ఇటీవలి కాలంలో 'బజ్‌బాల్' ఆటతీరుతో బాదుడే పరమావధిగా విరుచుకుపడుతున్న ఇంగ్లండ్ పప్పులు.. కాబూలీల ముందు ఉడకలేదు. బట్లర్, రూట్, బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్, కరన్ ఇలా ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో అఫ్గానిస్థాన్ తమ క్రికెట్ చరిత్రలోనే గుర్తుంచుకోదగ్గ విజయం నమోదు చేసుకుంది!!!

న్యూఢిల్లీ: డిఫెండింగ్ చాంపియన్‌గా వన్డే ప్రపంచకప్‌లో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 69 పరుగుల తేడాతో అఫ్గానిస్థాన్ చేతిలో పరాజయం పాలైంది. అంతర్జాతీయ స్థాయిలో ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్న అఫ్గాన్.. సంపూర్ణ ఆధిపత్యంతో ప్రపంచ చాంపియన్లను చిత్తుచేసి తమ దేశ క్రికెట్ చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించింది. ఈ మెగాటోర్నీలో రెండు పరాజయాల తర్వాత అఫ్గాన్‌కు ఇది తొలి గెలుపు కాగా.. ఇంగ్లండ్‌కు మూడు మ్యాచ్‌ల్లో రెండో ఓటమి. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్ 49.5 ఓవర్లలో 284 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (57 బంతుల్లో 80; 98 ఫోర్లు, 4 సిక్సర్లు) జట్టుకు మెరుపు ఆరంభాన్నివ్వగా.. వికెట్ కీపర్ ఇక్రామ్ (58; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చివర్లో ముజీబ్ ఉర్ రహమాన్ (16 బంతుల్లో 28; 3 ఫోర్లు, ఒక సిక్సర్), రషీద్ ఖాన్ (23; 3 ఫోర్లు) విలువైన పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 3, మార్క్ వుడ్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 40.3 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (66; 7 ఫోర్లు, ఒక సిక్సర్) టాప్ స్కోరర్ కాగా.. డేవిడ్ మలాన్ (32) పర్వాలేదనిపించాడు. అఫ్గాన్ స్పిన్ త్రయం రషీద్ (3/37), ముజీబ్ (3/51), మహమ్మద్ నబీ (2/16) దుమ్మురేపారు. అటు బ్యాట్‌తో ఇటు బంతితో అదరగొట్టిన ముజీబ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

అఫ్గానిస్థాన్: 49.5 ఓవర్లలో 284 (రహ్మానుల్లా 80, ఇక్రామ్ 58; ఆదిల్ రషీద్ 3/42, మార్క్‌వుడ్ 2/50), **ఇంగ్లండ్:** 40.3 ఓవర్లలో 215 (బ్రూక్ 66, మలాన్ 32; రషీద్ 3/37, ముజీబ్ 3/51).

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్	3	3	0	+1.82	6
న్యూజిలాండ్	3	3	0	+1.60	6
దక్షిణాఫ్రికా	2	2	0	+2.36	4
పాకిస్థాన్	3	2	1	-0.13	4
ఇంగ్లండ్	3	1	2	-0.08	2
అఫ్గానిస్థాన్	3	1	2	-0.65	2
బంగ్లాదేశ్	3	1	2	-0.69	2
శ్రీలంక	2	0	2	-1.16	0
నెదర్లాండ్స్	2	0	2	-1.80	0
ఆస్ట్రేలియా	2	0	2	-1.84	0

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

అప్పుడలా.. ఇప్పుడిలా!

2019 వన్డే ప్రపంచకప్‌లో భాగంగా ఇంగ్లండ్, అఫ్గానిస్థాన్ మధ్య జరిగిన పోరులో ఇంగ్లిష్ టీమ్ భారీ విజయాన్ని అందుకుంది. అప్పటి కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ (71 బంతుల్లో 148; 4 ఫోర్లు, 17 సిక్సర్లు) రికార్డు సెంచరీ నమోదు చేసుకోగా.. జో రూట్ (88), జానీ బెయిర్‌స్టో (90) దంచికొట్టారు. దీంతో ఇంగ్లండ్ 6 వికెట్లకు 397 పరుగులు చేసింది. ఆనక అఫ్గానిస్థాన్ 247 పరుగులకే పరిమితమై.. 150 రన్స్ తేడాతో ఓడింది. ఆ మ్యాచ్‌లో స్పిన్నర్లను టార్గెట్ చేసుకొని ఊచకోత కోసిన ఇంగ్లండ్ ఆటగాళ్లను.. ఈసారి అఫ్గాన్ అదే స్పిన్ ఉచ్చులో బిగించి ఉక్కిరి బిక్కిరి చేసింది. ఆ మ్యాచ్‌లో రషీద్, ముజీబ్, నబీ కలిసి 224 పరుగులు సమర్పించుకొని ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోగా.. తాజా మ్యాచ్‌లో 104 పరుగులిచ్చిన ఈ త్రయం ఎనిమిది మందిని పెవిలియన్‌కు పంపి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.

నేలకు దించారు!

అంతర్జాతీయ క్రికెట్‌కు 'బజ్‌బాల్'ను పరిచయం చేసి.. ఇటీవల వన్డేల్లో తరచూ భారీ స్కోర్లు చేస్తున్న ఇంగ్లండ్ జట్టు ముందు అఫ్గాన్ 285 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ సీజన్‌లో బ్యాటింగ్‌కు స్వర్గధామంగా మారిన ఢిల్లీ పిచ్‌పై హిట్టర్లతో కూడిన ఇంగ్లిష్ జట్టుకు ఇదొక లెక్కా అని అభిమానులు భావిస్తే.. అక్కడే అఫ్గాన్ అద్భుతం చేసింది. అరుణ్‌జైట్లీ స్టేడియంలో జరిగిన గత రెండు మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా, టీమ్‌ఇండియా ప్లేయర్లు భారీ షాట్లతో విరుచుకుపడి పరుగుల వరద పారించగా.. ఇంగ్లండ్ మాత్రం అందుకు భిన్నంగా వరుస వికెట్లు కోల్పోయింది. ఈ ఘనత మాత్రం కాబూలీలకే దక్కుతుంది. ఒక్కో ప్లేయర్‌ను ఒక్కో ప్రణాళికతో బుట్టలో వేసుకున్న తీరు ఎంత మెచ్చుకున్నా తక్కువే! ఈసారి ప్రపంచకప్‌లో మా దమ్మేంటో చూపుతామని.. టోర్నీకి ముందే ప్రకటించిన అఫ్గాన్.. అందుకు తగ్గట్లే ప్రపంచ చాంపియన్ ఇంగ్లండ్‌కు కోలుకోలేని దెబ్బకొట్టింది. ఇప్పటికే తొలి పోరులో న్యూజిలాండ్ చేతిలో పరాజయం పాలైన బట్లర్ సేన ఆత్మవిశ్వాసంపై ఈ ఫలితం భారీ ప్రభావం చూపిందనడంలో సందేహం లేదు. సాధారణంగా బ్యాటింగ్‌లో కాస్త బలహీనంగా కనిపించే అఫ్గాన్ ఈ పోరులో సమిష్టిగా సత్తాచాటింది. రహ్మానుల్లా మెరుపు ఆరంభాన్నివ్వగా.. ఆ తర్వాత వరుస వికెట్లు కోల్పోయినా.. లోయర్ ఆర్డర్‌తో కలిసి ఇక్రామ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఇక చివర్లో రషీద్, ముజీబ్ జోడించిన పరుగులే ఈ మ్యాచ్‌లో కీలకమయ్యాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇక బౌలింగ్‌లో తమ ప్రధాన అస్త్రమైన స్పిన్‌ను ఆ జట్టు సమర్థవంతంగా వినియోగించుకుంది. ముజీబ్‌తో బౌలింగ్ దాడి ప్రారంభించిన.. అఫ్గాన్ ఏ దశలోనూ ఇంగ్లండ్‌కు కోలుకోనివ్వలేదు. కట్టుదిట్టమైన బౌలింగ్‌కు పకడ్బందీ ఫీల్డింగ్ తోడవడంతో బట్లర్ సేన ఆటలు సాగలేదు. ఇంగ్లండ్ జట్టుకు సుదీర్ఘ కాలం సేవలందించిన స్టార్ బ్యాటర్ జొనాథన్ ట్రాట్.. ప్రస్తుతం అఫ్గాన్ కోచ్‌గా తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించాడు. 2011లో భారత్ వేదికగానే జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ఐర్లాండ్ చేతిలో పరాజయం పాలైన.. ఇంగ్లండ్ మళ్లీ ఇక్కడే జరిగిన మెగాటోర్నీలో మరో చిన్న జట్టులో చేతిలో ఓడటం కొసమెరుపు.

బోణీ కొట్టేదెవరో!

నేడు శ్రీలంక, ఆస్ట్రేలియా పోరు

లక్నో: ప్రపంచకప్ చరిత్రలో మరే జట్టుకు సాధ్యంకాని రీతిలో ఐదు సార్లు ట్రోఫీ చేజిక్కించుకున్న ఆస్ట్రేలియా.. ఈ మెగాటోర్నీలో బోణీ కొట్టేందుకు నానా తంటాలు పడుతున్నది. తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత్, దక్షిణాఫ్రికా చేతిలో చావుదెబ్బ తిన్న కంగారూలు.. సోమవారం శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనున్నారు. మరోవైపు మాజీ చాంపియన్ లంక కూడా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడి లయ అందుకునేందుకు ఇబ్బంది పడుతున్నది. గాయం కారణంగా కెప్టెన్ దసున్ షనక మెగాటోర్నీ నుంచి తప్పుకోగా.. అతడి స్థానంలో కుషాల్ మెండిస్ జట్టు పగ్గాలు అందుకున్నాడు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆసీస్‌కు వరుస పరాజయాలు ఎదురవుతుండగా.. ప్రస్తుతం పది జట్లు పాల్గొంటున్న ప్రపంచకప్‌లో ఆ జట్టు తొమ్మిదో స్థానానికి పరిమితమై ఉంది. 'ఇక ఇప్పటి నుంచి అన్నీ మ్యాచ్‌లు మాకు నాకౌట్ లాంటివే' అని ఆసీస్ సారథి ప్యాట్ కమిన్స్ ప్రకటించగా.. ఆసీస్‌ను నిలువరించి టోర్నీ శుభారంభం చేయడమే తమ లక్ష్యమని లంక కొత్త సారథి మెండిస్ పేర్కొన్నాడు. మరి మాజీ చాంపియన్ల మధ్య సమరంలో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి!

శిల్పకు పసిడి పతకం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ చాంపియన్‌షిప్‌లో శిల్ప స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. బెంగళూరు వేదికగా జరిగిన పోటీల్లో మహిళల మాస్టర్-1 కేటగిరీలో బరిలోకి దిగిన శిల్ప డెడ్ లిఫ్ట్‌లో 105 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. అండర్ 90 విభాగంలో శిల్ప పసిడి గెలుచుకోగా.. 100 కేజీల బరువెత్తిన ఇందు రజత పతకం చేజిక్కించుకుంది. ఇతర పోటీల్లో అండర్ 70 కేటగిరీలో మన రాష్ట్రానికి చెందిన అర్షియా (125 కేజీలు), సౌమ్య (115 కేజీలు) వరుసగా స్వర్ణ, రజతాలు ఖాతాలో వేసుకున్నారు.

అతడేమీ వసీం అక్రమ్ కాదు

ఆఫ్రిదిని పొగిడింది చాలన్న రవిశాస్త్రి

ముంబై: క్రికెట్‌లోనే గొప్ప సమరంగా భావించే భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌లో.. టీమ్‌ఇండియా మరోసారి విజేతగా నిలిచింది. వన్డే ప్రపంచకప్‌లో దాయాది చేతిలో ఓటమంటూ ఎరుగని భారత్ 8వ విజయంతో రికార్డును నిలబెట్టుకుంది. పాక్ తురుపుముక్కగా పేరొందిన షాహీన్ ఆఫ్రిది ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసినా.. పెద్దగా ప్రభావం చూపించలేకపోయాడు. కొత్త బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించే ఈ లెఫ్ట్‌ఆర్మ్ పేసర్.. శనివారం రోహిత్ శర్మ బాదుడుకు ఏం చేయాలో తెలియక తల పట్టుకున్నాడు. అహ్మదాబాద్ ప్రదర్శన అనంతరం ఈ స్పీడ్‌స్టర్‌పై భారత లెజెండరీ క్రికెటర్ రవి శాస్త్రి షాకింగ్ కామెంట్లు చేశాడు. షాహీన్ ఏమీ పాక్ వెటరన్ వసీం అక్రమ్ కాదని, అతడిని ఆకాశానికి ఎత్తేయాల్సిన అవసరం లేదని కుండబద్దలు కొట్టాడు. 'ఒకవేళ ఏ ఆటగాడు మంచి ప్రదర్శన కనబరిస్తే.. అతడిని మంచి ప్లేయర్ అనడం వరకే మన పొగడ్తలను పరిమితం చేయాలి. అంతేతప్ప అతడిని గొప్ప ఆటగాడంటూ ఆకాశానికెత్తేయొద్దు. షాహీన్ ఆఫ్రిది అంత గొప్ప బౌలర్ కాదు. ఆ విషయాన్ని మనమంతా అంగీకరించాలి' అని రవి శాస్త్రి పేర్కొన్నాడు.

బాబర్‌కు విరాట్ కోహ్లీ స్పెషల్ గిఫ్ట్

అహ్మదాబాద్: వన్డే ప్రపంచకప్‌లో భాగంగా చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ పోరు అనంతరం మైదానంలో ఓ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. టీమ్‌ఇండియా స్టార్ విరాట్ కోహ్లీ తన జెర్సీని పాక్ సారథి బాబర్ ఆజమ్‌కు అందించాడు. దీనికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అయితే.. పాక్ మాజీ పేసర్ వసీం అక్రమ్ మాత్రం బాబర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. జెర్సీ తీసుకోవడానికి ఇది సరైన సమయం కాదని.. అంతగా కావాలనుకుంటే డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లాల్సిందని అభిప్రాయపడ్డాడు. 'మ్యాచ్ అనంతరం గ్రౌండ్‌లో కోహ్లీ నుంచి బాబర్ జెర్సీ తీసుకోకుండా ఉండాల్సింది. ఎందుకంటే అది ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళ్లే ప్రమాదం ఉంది. డ్రెస్సింగ్ రూమ్ వద్దనో లాబీలోనో తీసుకోవాల్సింది. మీ బంధువుల అబ్బాయి ఎవరైనా కోహ్లీ జెర్సీ అడిగి ఉంటే.. ఆట అయిపోయిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్ వద్ద ప్రైవేట్‌గానే ఆ జెర్సీ తీసుకోవాల్సింది' అని అక్రమ్ పేర్కొన్నాడు.

సీవీ ఆనంద్ సెంచరీ

హైదరాబాద్ ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ లీగ్ 'సి' డివిజన్ మ్యాచ్‌లో సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ (76 బంతుల్లో 101; 13 ఫోర్లు, 4 సిక్సర్లు) సూపర్ సెంచరీతో చెలరేగాడు. సికింద్రాబాద్ క్లబ్ తరపున బరిలోకి దిగిన ఆనంద్.. ఆదివారం సత్య క్లబ్‌తో జరిగిన మ్యాచ్‌లో దంచికొట్టాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆనంద్.. ఫోర్లు, సిక్సర్లతో రెచ్చిపోయాడు. ఆనంద్‌తో పాటు రాంబాబు (102) కూడా శతకం నమోదు చేయడంతో మొదట బ్యాటింగ్ చేసిన సికింద్రాబాద్ క్లబ్ భారీ స్కోరు చేసింది.

హెడ్ వచ్చేస్తున్నాడు

లక్నో: వరల్డ్ కప్‌లో వరుస ఓటములతో కుంగిపోయిన ఆస్ట్రేలియాకు శుభవార్త! గాయం నుంచి కోలుకున్న విధ్వంసక ఓపెనర్ ట్రావిస్ హెడ్ త్వరలోనే జట్టుతో కలువనున్నాడు. ఎడమ చేతి గాయం తగ్గడంతో హెడ్ నెట్స్‌లో ప్రాక్టీస్ మొదలెట్టాడు. గాయం తగ్గిపోయింది. అనుకున్నదానికంటే ప్రస్తుతం మెరుగ్గా ఉన్నా అని హెడ్ తెలిపాడు. ఈ స్టార్ ఓపెనర్ గురువారం(అక్టోబర్ 19) నాటికి భారత్‌కు రానున్నాడు. శుక్రవారం(అక్టోబర్ 25న) నెదర్లాండ్స్‌తో జరిగే మ్యాచ్‌కు హెడ్ అందుబాటులో ఉండే అవకాశం ఉంది.

రన్నరప్ బోపన్న జోడీ

షాంఘై: భారత వెటరన్ టెన్నిస్ ప్లేయర్ రోహన్ బోపన్న షాంఘై మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జంట 7-5, 2-6, 7-10తో మార్కెల్ గ్రానొల్లర్స్-హొరాకియో జెబల్లాస్ జోడీ చేతిలో ఓటమి పాలైంది. ఇటీవల జరిగిన ఆసియా క్రీడల మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం నెగ్గిన 43 ఏండ్ల బోపన్న.. ఈ ప్రదర్శనతో వచ్చే నెలలో జరుగనున్న ఏటీపీ ఫైనల్స్‌కు అర్హత సాధించాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.